## క్లుప్తంగా

### విద్య,వైజ్ఞానిక శిక్షణ తరగతులు విజయవంతం

**మదనపల్లె సిటీ:** రాష్ట్ర విద్య,వైజ్ఞానిక తరగతులు విజయవంతమైనట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ తెలిపారు. స్థానిక అంగళ్లు సమీపంలోని విశ్వం ఇంజినీరింగ్ కాలేజీలో 17వతేదీ నుంచి 26వరకు నిర్వహించినట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరైనట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు, రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్, ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలలో విద్యార్థులకు సకాలంలో విద్యార్థులకు అందజేయాలని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో పాఠ్యపుస్తకాలు పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

### ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీడీ

**ములకలచెరువు:** మండలంలోని సెంట్రల్‌సూకల్, వేపూరికోట జీపీలలో జరుగుతున్న ఫారం పాండు పనులను ఏపీడీ నందకుమార్ మంగళవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులు ఫారం పాండు వర్క్ చేసుకుని నీటి నిల్వ చేసుకోవాలని, తీవ్ర మైన వర్షాభావ పరిస్థితుల్లో పొలంలోఉన్నా పంట ఎండకుండా ఒక తడి అందించవచ్చని అలాగే పశువులు, పక్షులు నీరు తాగడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఎంపీడీఓ హరినారాయణ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు .

### అలరించిన బకాసుర వధ ఘట్టం

**మదనపల్లె సిటీ:** మహాభారత మహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక నీరుగట్టువారిపల్లెలోని మైదానంలో మంగళవారం బకాసుర వధను భాగవతారిని స్వర్ణలత వివరించారు. బకాసుర వధలోని ఘట్టాలను అలరించాయి. సాయంత్రం ద్రౌపది స్వయంవరం నాటకం అందరిని ఆకట్టుకుంది. మహాభారత మహోత్సవాన్ని స్థానికులు ఆకస్తికంగా తిలకిస్తున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కొరముట్ల వెంకటేష్, రామచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### డ్రైవర్‌పై కేసు నమోదు

**పెద్దతిప్పసముద్రం:** మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ వరికసువుపల్లికి చెందిన ఎర్రవ్వగారి సుధాకర్‌రెడ్డి కుమారుడు పురిషిత్ రెడ్డి (13) సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. బి.కొత్తకోట నుంచి ఖాళీ ట్యాంకర్ లారీ బెంగళూరుకు వెళుతూ వరికసువుపల్లిలో నడచుకుంటూ వెళుతున్న బాలుడిని వేగంగా ఢీకొంది. బాలుడి తండ్రి సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ గోవింద్ గుప్తా (40)పై కేసు నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు.

### బీజేపీని బలోపేతం చేద్దాం

**పెద్దతిప్పసముద్రం:** మండలంలో బీజేపీ బలోపేతానికి కలసి కట్టుగా కృషి చేద్దామని మండలాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఆయనతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు మల్లెం శివయ్య, కార్యం శంకర్, వెంకటనారాయణ, బాస్కర్‌రెడ్డి, రామచంద్ర, శంకర్ తదితరులు మండలంలోని కందుకూరులో పర్యటించారు. అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా పలువురికి స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

### హెచ్ఐవీపై నివారణపై అవగాహన

**పీలేరు :** స్థానిక వారపు సంతలో కళాజాత ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. మంగళవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, కోర్‌స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కేసీ నటరాజ్ కళాబృందం కళాజాతతో అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, క్షయవ్యాధి సంబంధం, సుఖవ్యాధులు, చికిత్స గురించి వివరించారు. కార్యక్రమంలో కోర్ సంస్థ ఓఆర్‌డబ్ల్యూ రాజమ్మ, శైలజ, పీఈలు మల్లీశ్వరి, మునీశ్వరి, అనిత తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం

**పీలేరు రూరల్ :** పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని సర్పంచ్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య, వాటర్‌మెన్‌లు, ఎలక్ట్రీషియన్లు, బిల్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. 170 మంది కార్మికులకు రెండు జతలు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ప్రజారోగ్యం కాపాడడంలో పంచాయతీ కార్మికుల పాత్ర కీలకమైందని తెలిపారు. కార్మికులకు తాము అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవో గురుమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డుమెంబర్లు మల్లికార్జునరెడ్డి, శ్రీనాథరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, కాలేషా, రమణ, పరమేష్, అబీద్ తదితరులు పాల్గొన్నారు.

# రమాబాయి త్యాగం మరువలేనిది



రమాబాయి వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న బాస్ నాయకులు



పీలేరు: రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

**బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు శివప్రసాద్**

**మదనపల్లె రూరల్ :** దేశ ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు అంబేడ్కర్ అయితే, ఆ మహనీయుడి కష్టాలను, కన్నీళ్లను సమానంగా పాలుపంచుకొని, ఆయన విజయం వెనుక నిలిచిన త్యాగమూర్తి మాతా రమాబాయి అని భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) వ్యవస్థాపక అధ్యక్షులు పీటీయం శివప్రసాద్ తెలిపారు. అంబేడ్కర్ ధర్మపత్ని మాతా రమాబాయి వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక బాస్ కార్యాలయంలో మంగళవారం సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివప్రసాద్, వీసీకే, బాస్‌నేతలతో కలిసి మాతా రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ..అంబేడ్కర్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాడుతున్నప్పుడు , ఆయనకు అండగా నిలిచిన ఆదర్శ మహిళ, త్యాగానికి ప్రతిరూపం, ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనం మాతా రమాబాయి అన్నారు. ఓర్పు, విధేయత, వినమ్రతతో ఆమె డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను ప్రపంచ మేధావిగా తీర్చిదిద్ది, భారతదేశానికి దీపంలా అవతరించారని చెప్పారు. కడుపున పుట్టిన బిడ్డలు, కళ్ల ముందు ఒకొక్కరు కడతేరి పోతున్నా...చెక్కు చెదరని ఆమె ధైర్యం మహిళా లోకానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. భర్త ఉన్నత చదువుల కోసం దూరంగా ఉన్నా ఆమె చేసిన ఒంటరిపోరాటం ప్రతి మహిళకు చక్కని పాఠం లాంటిదన్నారు. దేశ ప్రజల ఆకలి తీర్చడం కోసం తాను ఆహారానికి దూరమై పౌష్టికాహారలోపంతో 37 ఏళ్లకే కన్నుమూసిన కారుణ్యమూర్తి రమాబాయి అన్నారు.

భారత రాజ్యాంగ శిల్పి అంబేడ్కర్ జీవితంలో ఆయన భార్య రమాబాయి పాత్ర చాలా ప్రభావవంతమైందన్నారు. ఆదర్శ దంపతులైన అంబేడ్కర్,రమాబాయిల జీవితం మనందరికీ ఒక పాఠంగా నిలవాలని, అందుకోసం వీరి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాస్, వీసీకే నాయకులు ముత్యాలమోహన్, జి.గంగులప్ప, రవిశంకర్, గంగాధర్, కృష్ణ, రాయల్‌సూరి, నారాయణ, హైదర్, మనోహర్, ప్రశాంత్, అభి, భాను, శంకర తదితరులు పాల్గొన్నారు.

**ఆదర్శమూర్తి రమాబాయి అంబేడ్కర్**

**పీలేరురూరల్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ ఆదర్శమూర్తి అని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధరణికుమార్, సీపీఐ నాయకులు టి.ఎల్. వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో రమాబాయి 90వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రమాబాయి, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ దంపతులు మనకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రసాదించారని పేర్కొన్నారు. దేశంలో అన్ని వర్గాలు గౌరవ, మర్యాదలు పొందుతున్నారంటే వారు పెట్టిన భిక్షేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రవి, బాలగంగాధర్, రవిచంద్ర, రమేష్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వైఎస్ జగన్‌తో మదనపల్లె కౌన్సిలర్ల సమావేశం



మదనపల్లె నుంచి బయలుదేరుతున్న చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు

**మదనపల్లె:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలో బుధవారం నిర్వహించే సమావేశానికి మదనపల్లె స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీకి చెందిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మంగళవారం రాత్రి ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీం అస్లాంతో కలిసి అందరు కౌన్సిలర్లు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. మున్సిపాలిటీలో 35 వార్డు కౌన్సిలర్లు ఉండగా గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. 33 మంది కౌన్సిలర్లు తిరుగులేని విజయం సాధించారు. టీడీపీ కేవలం రెండు కౌన్సిలర్లకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌన్సిలర్లను టీడీపీ నేతలు ప్రలోభపెట్టే ప్రయత్నాలు జరిగాయి. దీన్ని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తిప్పికొట్టారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ మారే ప్రసక్తే లేదని తెగేసి చెప్పారు. ఇదే విషయాన్ని రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ.మిథున్‌రెడ్డిని కలిసి స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో మదనపల్లెతోపాటు పలు మున్సిపాలిటీలకు చెందిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, చైర్మన్లతో సమావేశం నిర్వహిస్తుండటంతో చైర్‌పర్సన్, కౌన్సిలర్లు బయలుదేరి వెళ్లారు.

## వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం

**– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి**



మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు శ్యామ్

**కలికిరి(వాల్మీకిపురం):** వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం సాధ్యమవుతుందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన శ్యామ్ మంగళవారం మాజీ ఎమ్మెల్యే చింతలను కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కుల, మత, వర్గాలు, రాజకీయాలతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ వారికే పనులు జరిగేలా స్వయానా సీఎం చంద్రబాబు బహిరంగంగా చెప్పడం చూస్తున్నామన్నారు. అంతే కాకుండా ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయక పోవడం ప్రజలను తీవ్రంగా మోసగించడమేనన్నారు. ప్రభుత్వం విస్మరించిన సంక్షేమ కార్యక్రమాలు, అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాల్సిన బాధ్యత నూతన కమిటీలపై ఉందన్నారు. పార్టీ బలోపేతానికి కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతల శివానందరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ళ భాస్కర్, ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టరు అబ్దుల్‌కలీం, ఎంపీటీసీ సభ్యుడు రాజేష్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, సుధాకర్ రెడ్డి, ఉయద్‌కుమార్‌రెడ్డి, అమీన్పీర్, రెడ్డిప్రసాద్, వేణు, శ్రీనివాసులురెడ్డి, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆ పోలీసులను సస్పెండ్ చేయాలి



కేవీ రమణ

**పెద్దతిప్పసముద్రం:** ముగ్గురు యువకులను నడి బజారులో భయంకరంగా కొట్టి అవమానించిన తెనాలి పోలీసులను తక్షణం సస్పెండ్ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని నేషనల్ హెల్ప్‌లైన్ అగెనిస్ట్ అట్రాసిటీ (ఎన్‌హెచ్‌ఏఏ) ఫీల్డ్ లెవల్ కౌన్సిలర్ కేవీరమణ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మంగళవారం ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎవరైనా ఏదైనా నేరం చేసినా వేరే ఇతర కారణాలైనా కేసులు నమోదు చేసి న్యాయ స్థానంలో హాజరు పరచాలి. జాన్ విక్టర్, షేక్ బాబూలాల్, థోమా రాకేష్ అనే యువకులను పోలీసులు కర్కశంగా కొట్టడం చూస్తుంటే చంద్రబాబు రెడ్ బుక్ రాజ్యాంగానికి ఈ ఘటన నిలువెత్తు నిదర్శనమన్నారు. పోలీసులకు చట్టాలన్నా, న్యాయ స్థానాలన్నా ఏ మాత్రం గౌరవం లేదనడానికి బరితెగించి రెచ్చిపోయిన ఈ పోలీసుల క్రూరత్వమే సజీవ సాక్ష్యమని ఆయన వెళ్ళడించారు. ఈ అమానుష ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, హైకోర్టు న్యాయమూర్తులు సుమోటోగా స్పందించాలని కోరారు. సామాన్యులపై దాడి చేసిన తెనాలి పోలీసులను జీవిత కాలం సస్పెన్షన్ వేటు వేయడమే గాక వారిపై కేసులు నమోదు చేయాలని కేవీ రమణ డిమాండ్ చేశారు.

### నేడు యోగాంధ్ర శిక్షణ

**పీలేరురూరల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగ శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో యోగంధ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు, ఎంపీడీవో జి. శివశంకర్ అన్నారు. మంగళవారం మెగా యోగాంధ్రకు ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం 6 గంటల నుంచి 7 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు, విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, శ్రీ దివ్యయోగ అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సు విజయవంతం చేయండి

**పీలేరు :** ఈ నెల 31న రాయచోటిలో నిర్వహించే జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సు విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జిల్లా సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా, గాలేరు – నగిరి ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేయాలన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిధులు రాబట్టేందుకు ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తేకుండా విస్మరిస్తే ప్రజా ఉద్యమం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు, యశోద, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీబీ నివారణపై అవగాహన ర్యాలీ



చింతపర్తిలో టీబీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

**కలికిరి(వాల్మీకిపురం):** టీబీ నివారణపై వంద రోజులు క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి జులేఖ భేగం అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం చింతపర్తిలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు కాంపెయిన్‌పై సెన్సిటైజేషన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ మూడు పద్ధతులలో నివారించవచ్చని, మొదటగా అనుమానిత లక్షణాలు కలిగిన, బిఎంఐ తక్కువ ఉన్నవారు, షుగరు వ్యాధిగ్రస్తులు, పొగ త్రాగేవారు, మద్యం సేవించేవారు, గతంలో టీబీ వచ్చి బాగైన వారికి గళ్ళ పరీక్షలు నిర్వహించాలన్నారు. పాజిటివ్ వచ్చిన వారికి ట్రీట్మెంట్ ఇవ్వాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో కలిసి టీబీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాయిశ్రీ, హెచ్ఈ మహమ్మద్ రఫీ, టి.బి. పర్యవేక్షకులు నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం



మదనపల్లెలో యోగాపై అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్



పీటీఎంలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు, వైద్యసిబ్బంది



రామసముద్రం జెడ్పీ హైస్కూల్లో యోగా శిక్షణ

**మదనపల్లె సిటీ:** యోగాసనాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రముఖ యోగామాస్టర్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో సమ్మర్ హాకీ కోచింగ్ క్రీడాకారులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. యోగా సాధనతో మానసిక ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. విద్యార్థులు రోజు పాఠశాలలో యోగ చేయాలని సూచించారు. దీని వల్ల చదువులో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. నిత్యం ఉల్లాసంగా ఉంటారన్నారు. క్రీడలతో పాటు యోగా కూడా చేయాలని సూచించారు. వివిధ రకాల ఆసనాలు ప్రదర్శించి వాటితో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కోచ్‌లు ప్రసాద్‌రెడ్డి,నౌషాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

**యోగా మనిషి జీవితంలో భాగం కావాలి**

**పెద్దతిప్పసముద్రం:** యోగా మనిషి జీవితంలో భాగం కావాలని, సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ యస్థానీ అన్నారు. మంగళవారం పీటీఎంలో అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది కలసి యోగాసనాలు వేశారు. యోగా సాధనతో మానసిక సమస్యలు, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందన్నారు.

**ప్రతి వ్యక్తికి యోగాతో ఆరోగ్యం**

**రామసముద్రం:** యోగా ప్రతి వ్యక్తికి ఆరోగ్యాన్ని ఇస్తుందని ఎంపీడీవో భానుప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు మేనెల 21వ తేదీ నుంచి జూన్ 21 వరకు యోగాపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. యోగా వలన ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## రేషన్‌షాప్ వేయింగ్ మెషిన్స్ తనిఖీ



వేయింగ్ మెషిన్స్‌ను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రమాదేవి

**మదనపల్లె రూరల్ :** ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం, మోసాలను నివారించే క్రమంలో భాగంగా రేషన్‌షాప్‌లకు సంబంధించిన వేయింగ్ మెషిన్స్, ఈ–పోస్ యంత్రాలను తనిఖీ చేస్తున్నట్లు తూనికలు, కొలతల శాఖ పలమనేరు ఇన్‌స్పెక్టర్ రమాదేవి తెలిపారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మదనపల్లె అర్బన్, రూరల్‌లోని రేషన్‌షాప్‌లకు సంబంధించిన ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషిన్స్, ఈపోస్ యంత్రాలను తనిఖీ చేశారు. తూకాల్లో కచ్చితత్వాన్ని నిర్ధారించి, బ్యాటరీ లైఫ్‌ను పరిశీలించారు. ఈనెల 31వ తేదీ వరకు తనిఖీల ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని, ఇందులో భాగంగా మదనపల్లె డివిజన్‌లోని మదనపల్లె, తంబళ్లపల్లె, వాల్మీకిపురం, రామసముద్రం, రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని చిట్వేలు, నందలూరు, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు మండలాల్లో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

## మనసు మారితే జీవితం మారుతుంది

**వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ అరవింద్**



మాట్లాడుతున్న అరవింద్ నూతలపాటి

**కురబలకోట:** మనసు (మైండ్ సెట్) మారితే జీవితమే మారిపోతుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు, కౌన్సిలింగ్ సైకాలజిస్టు డాక్టర్ అరవింద్ నూతలపాటి అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రీ ప్రోగ్రామింగ్ ఆఫ్ మైండ్‌పై మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి, నిరంతర సమాచార ప్రవాహం, ఒత్తిడి మధ్య మనస్సు వివిధ అపనమ్మకం, ఆందోళనకు గురవుతుందన్నారు.ఇవి శక్తి సామర్థ్యాలపై ప్రభావాన్ని చూపుతాయన్నారు. రీ ప్రోగ్రామింగ్ వలన ప్రతికూల ఆలోచనలు నియంత్రించి నూతన ఆలోచనా శక్తి పెరగడంతో పాటు మానసిక పరివర్తనకు మార్గం పడుతుందన్నారు. బలమైన వ్యక్తిత్వ నిర్మాణానికి దారి తీస్తుందన్నారు. మార్పు అనేది ఎవరికి వారిలో స్వతహాగా మొదలవ్వాలన్నారు. ముఖ్యంగా ఆధునిక జీవితానికి మానసిక మార్గదర్శిగా రీ ప్రోగ్రామింగ్ మైండ్ ఉపకరిస్తుందన్నారు. వ్యక్తిగత విజయానికి కూడా మూలస్థంభంగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు అనవసర ఆలోచనలను విడనాడి సానుకూల దృక్పథంతో చదువు సంధ్యల్లో రాణించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు.

## చలో సంగమేశ్వర పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

**ములకలచెరువు:** రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో మే 31న సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కోసం సంగమేశ్వర వద్ద నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు జన సమీకరణలో భాగంగా మంగళవారం ములకలచెరువు మార్కెట్ యార్డులో పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపీ, తెలంగాణ విజిలెన్స్ ఆఫ్ ఇండియా చైర్మన్ తనకంటి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఏపీ అంటే అమరావతి, పోలవరం మాత్రమే కాదు అన్నారు. ఏపీ అంటే అందరిప్రదేశ్ అని నినాదంతో సంగమేశ్వరం వద్ద రాయలసీమ సాగునీటి సాధన సమితి నిర్వహించే భారీ బహిరంగ సభకు హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. దశాబ్దాలుగా రాయలసీమ నిర్లక్ష్యానికి గురువుతోందన్నారు. ఎం. సదాశివప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, కె. రమణారెడ్డి, రాము, నరసింహారెడ్డి, రెడ్డిమల్లప్ప, సుబ్బయ్య, ఈశ్వరప్ప, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## దారి కోసం టమాటా రైతుల ధర్నా



అంగళ్లులో ధర్నా నిర్వహిస్తున్న టమాటా రైతులు

**కురబలకోట:** మండలంలోని అంగళ్లు టమాటా మండీలకు వెళ్లడానికి దారి కోసం మంగళవారం రాత్రి రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. టమాటా మండీలకు, గొర్రెల సంతకు నేరుగా దారి ఉంది. టెర్రకోట నగర్ నుండి కూడా మండీల వద్దకు వెళ్లడానికి ఇంకో దారి ఉంది. అయితే ఈ దారి ద్వారా వాహనాలు వెళ్లకుండా ఆప్రాంతంలోని ఓ ఇంటి యజమాని రోడ్డు పక్కన పైపులు నాటాడు. ఈ దారి కోసం కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. దారి సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆగ్రహించిన టమాటా రైతులు దారికి అడ్డుగా నాటిన పైపులను తొలగించాలని ధర్నా నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకుని సంఘటనపై విచారణ జరిపారు. రైతులతో మాట్లాడారు. స్థానిక పంచాయతీ అధికారులతో మాట్లాడి దారి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం ముదివేడు ఎస్ఐ దిలిప్‌కుమార్ ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబీకులకు నగదు అందజేస్తున్న జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్‌పిళ్ళై

**కలకడ :** రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పశు సంవర్ధకశాఖ సహాయకుడి కుటుంబానికి ఆశాఖ నుంచి రూ.1,29,200 ఆర్థిక సహాయం అందజేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్ళై తెలిపారు. మండలంలోని కె.బాటవారిపల్లె సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో కలకడ మండలం నడిమిచెర్ల పంచాయతీకి చెందిన షేక్ ఖాదర్‌బాషా మృతి చెందాడు. అతడు బాలయ్యగారిపల్లె పంచాయతీ సచివాలయంలో వెటర్నిటి అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉండే వారు. మృతిచెందిన విషయం తెలుసుకున్న అధికారులు మదనపల్లె డివిజన్ నుంచి రూ.51,500, రాయచోటి డివిజన్ నుంచి రూ.77,700 లను మంగళవారం నడిమిచెర్లలోని మృతుని ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులకు అంజేశారు. కార్యక్రమంలో రాయచోటి డివిజన్ ఉప సంచాలకులు విజయ్‌కుమార్, కలకడ సహాయ సంచాలకులు క్రిష్ణయ్య, వైద్యాధికారులు డాక్టర్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

## లాంజ్ బాత్‌రూమ్‌లో వ్యక్తి మృతి

**నెల్లూరు(క్రైమ్):** నెల్లూరు ఆర్టీసీ ప్రాంగణంలోని ఎంఎస్‌ఆర్ డీలక్స్ లాంజ్ బాత్ రూమ్‌లో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగ మండలం కారనిమిట్టకు చెందిన ఎస్.విజయకుమార్ (26) మదనపల్లిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో అనస్థీషియా టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతడికి రెండు నెలల క్రితం సమీప బంధువైన ఉషతో వివాహమైంది. సోమవారం విజయకుమార్ మదనపల్లిలోని వైద్యశాలకు వెళ్లాడు. డాక్టర్ సూచనల మేరకు మందులు తీసుకెళ్లేందుకు నెల్లూరుకు వచ్చాడు. ఆర్టీసీ బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్ పక్కనే ఉన్న ఎంఎస్‌ఆర్ డీలక్స్ లాంజ్‌లో బాత్‌రూమ్‌కు వెళ్లాడు. అక్కడే కుప్పకూలి మృతిచెందాడు. ఈ విషయాన్ని గమనించిన లాంజ్ నిర్వాహకులు చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మంగళవారం నెల్లూరుకు చేరుకున్న బాధిత కుటుంబం విజయకుమార్ మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైంది. మృతుని తమ్ముడు చందు ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. ఎస్సై వీసీ సుబ్రహ్మణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

**కలికిరి:** మండలంలోని మేడికుర్తి గ్రామం ఆసాదివారిపల్లికి చెందిన టి.నాగార్జున భార్య సంధ్య అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకుంది. వైద్య ఖర్చులకు సాయమందించాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని, రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్ రెడ్డిని ఆశ్రయించారు. ఈ మేరకు ప్రధాన మంత్రి రిలీఫ్ ఫండ్ రూ.1.80 లక్షలు మంజూరు కావడంతో మంగళవారం రూ.1.80 చెక్కును మాజీ ఎమ్మెల్యే చింతల బాధితురాలి భర్తకు అందజేశారు. దీంతో బాధిత కుటుంబానికి ఆర్థిక స్వాంతన లభించినట్లైంది. కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకులు బావాజీ, ఫయాజ్, నజీర్ బాషా, యాసన్ పాల్గొన్నారు.